చెప్పులు కుట్టేవాడు

నన్ను మీరు చూసే వుంటారు. కాని నేను మీకు గుర్తు వుండను. మీరు ఎన్ని రాళ్ళనూ రప్పలనూ చూడటంలేదు! అవన్నీ మీకు గుర్తు వుంటున్నయ్యా? వుండవు. అదే విధంగా నేనూ మీకు గుర్తు వుండను. నాతో మీకు పనిలేదా అంటే వుంటుంది. రాయితో మాత్రం మీకు పని వుండదూ? వుంటుంది. మీరు ఏ గోడనో కొట్టవలసి వస్తుందనుకోండి. అప్పుడు ప్రక్కన వున్న రాయిని తీసుకొంటారు; దిగగొడతారు. తరువాత ఆ రాయిని విసిరిపుచ్చుని అవతల పారవేస్తారు. ఆ రాయి మీకు ఉపయోగించింది గనుక గుర్తు వుంటుందా? ఉండదు నేనూ అంతే. ఏ చెప్పో తెగితే నాతో పని చేయించుకొంటారు. కాని నేను మీకు గుర్తు వుండను. కాకపోతే పనిచేసినందుకు ఏ కానో అర్ధణో నామీదకు విసరి పారవేసి వెళ్తారు.

నాతో పని చేయించుకునే వారితో, నాకు మాట్లాడ బుద్ధి అవుతుంది. వారి కష్టసుఖాలు కనుక్కోబుద్ధి అవుతుంది. నాకూ వారికీ తెగనిసంబంధం ఏదో వున్నట్లు అనిపిస్తుంది. కాని వారు పడనిస్తేనా!

"చెప్పుల మడమలు బాగా అరిగిపోనాయ్ బాబుగారు" అనేవాణ్ణి. ఎందుకనో వారు విననట్టే నటించేవారు. మొహం అటువైపుకి తిప్పుకునేవారు.

"మడమ వేస్తా బాబూ, లేకపోతే కాలు దెబ్బ తింటుంది" అనేవాణ్ణి.

"చెప్పినపని చెయ్యవాయ్" అనేవారు.

"అట్టాగే బాబూ." అని వారు అడిగినట్లు ఉంగటం వేసి ఇచ్చేవాణ్ణి కాని వారు బజార్న నడుస్తూ కనపడినప్పుడల్లా మడమ వెయ్యకపోతినే అని

మనస్సులో దేవుతూనే వుండేది. "ఉంగటం బాగుందా బాబూ?" అని అడగబుద్ధి అవుతూనే వుండేది. కాని వారు అడగనిస్తేనా? ఎరగనట్టు, మొహం అవతలికి తిప్పుకొని వెళ్ళి పోతుండేవారు. అట్లా ఎందుకు చెయ్యాలి? నాకు అర్థం అయ్యేదిగాదు, వెళ్ళనిచ్చేవాణ్ణి.

ఒకరోజు ఒకాయన చెప్పులకాళ్ళతో ఈడ్చుకుంటూ వచ్చాడు. ఒక చెప్పు ఉంగటం తెగిపోయింది; ఒకచెప్పు కాలిని కప్పే నడిమిభాగం లేచిపోయి వుంది. అట్లా వున్న చెప్పు చేత్తో పట్టుకు రావటం న్యాయం. ఈ సంగతి నాకు తెలియగాలేంది_ అందరికీ తెలియదా? అందరికీ తెలుసు. కాని అలాగే చెప్పుల్ని కాళ్ళతో అతి కష్టంమీద ఈడ్చుకుంటూ వచ్చాడు. కుట్టమన్నాడు చెప్పులు, జాతిచెప్పులు. బాగా వున్నాయి. వాటిని చూడగానే నాకు మనస్సు లేచి వచ్చింది. ఎంతో జాగ్రత్తగా చక్కగా కుట్టాను. ఆయన అడక్కుండానే పాలిష్ చేశాను. ఆయన కాళ్ళముందు పెట్టాను. చూడ్డానికి ఎంత బాగున్నాయి అనుకున్నావు! బండి లాగటానికి మువ్వలు, కుచ్చులువేసుకొని నిలబడిన కోడెదూడలకుమల్లే వున్నాయి. ఆయన తొడు కున్నాడు. ఆయనకాలు ఎక్కడ నొచ్చుతుందోనని ఉంగటానికి, కాలునికప్పే దానికి మంచి మెత్తని తోలువేసి కుట్టాను. ఆ మెత్తదనం కాళ్ళకు తెలియ కుండా వుంటుందా? అందుకని, "ఎట్టా వున్నాయండీ" అని అడిగాను.

"ఉన్నయ్ లేవాయ్" అని ఆయన ఒక అణా విసురుగా పారవేసి వెళ్ళిపోయారు. ఎందుకంత కోపం? ఒక మంచి మాట అంటే ఆయన సొమ్మేం పోయె! అనను.

నేను కూర్చునేది నాలుగు బజార్లు కలిసిన దగ్గర. ఒక ప్రక్కగా, జనం నడిచే దారిలో కూర్చుంటాను. అస్తమానం అక్కడే కూర్చోవలసి రావటంవల్ల, ఎండకి తట్టుకోలేక, చిన్న దేరా గుడ్డ దొరికతే, దానిని పెల్లలమీద లేపి, దానికింద కూర్చొని వుంటాను. నేను చెప్పులు బాగా కుట్టగలను. అయితే నాతో చెప్పును మరామత్తు చేయించుకునే వారేగానే కుట్టించుకునేవారు లేరు. ఒకవేళ ఎవ రన్నా కుట్టించుకుందాం అనుకున్నా నన్ను నమ్మి ముందుగా ఎవరు డబ్బి

స్తారు? నా దగ్గర చెప్పుకు కావలసిన పెట్టుబడి పెట్టడానికి నయాపైసా లేదు. మొట్టమొదట్లో ఎట్లాగో ఒక రూపాయి పోగుజేసి, పెద్దషాపులవాళ్ళు, పనికిరాని తోళ్ళ తుక్కు అమ్ముతుంటే కొన్నాను. అదే నా పెట్టుబడి. ఆ తోళ్ళ తుక్కుముందు వేసుకుని కూర్చొని యాపారం మొదలు పెట్టాను. పొద్దున్నే గంజినీళ్ళు తాగివచ్చి కూచునేవాణ్ణి. నాకు మల్లే చెప్పులు కుట్టే వాళ్ళని నేను చాలామందిని చూశాను. వాళ్ళు చూట్టానికి గలీజుగా వుండటంవల్ల చెప్పులు కుట్టించుకునే పెద్దమనుష్యులు వాళ్ళ దగ్గరకు వచ్చే వారు కాదు. అందుకని అందిన గుడ్డపీలికలు అన్నిటినీ చేర్చి పొడుగ్గా కుట్టి ఒక తలగుడ్డ తయారుచేశాను. దాన్ని కాసిని ఎర్ర నీళ్ళలో ముంచి కంటికి నదరుగా వుండేటట్టు చేశాను. అది చుట్టుకుని పని లోకి వెళ్ళేవాణ్ణి. మొదటిరోజు అది తలకు చుట్టుకుని, పిల్లలు బజార్లో ఏరుకొచ్చిన అద్దం ముక్కలో చూసుకున్నాను. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. డాబుసరిగానే వుంది. నన్ను చూసుకుంటే నాకే నవ్వువచ్చింది. నవ్వాను తుసుక్కున.

“ఎందుకట్లా నవ్వుతావ్? నీకేమన్నా పొయ్యేకాలం వచ్చిందా?” అంది గుడిసెది.

“ఇటు చూడు” అన్నాను.

“పోతు పేరంటాలల్లే వున్నావు” అంది, అని తనూ నవ్వింది.

తల వంచుకొని నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని మరీ నవ్వింది. అది నవ్వితే, దాని నవ్వు కిర్రు చెప్పులమీద తగరం మెరిసినట్లు మెరిసేది.

నా గుడిశెది నాకు చెప్పులు కుట్టటంలోకూడా బాగా సహాయం చేసేది. నేను పొద్దున్నే పనిలోని వెళితే అదికూడా వుడకేసి తొమ్మిది పది గంటలకల్లా నా సరసనే జేరేది. దానికికూడా చెప్పులు కుట్టడం కాస్త వచ్చు. ఎవరు నేర్పారు. నన్ను చూచి అదే నేర్చుకుంది. అయితే పాలిష్ చెయ్యటం మాత్రం నాకన్నా బాగా చేసేది. అణిచిపెట్ట రుద్దేది. చెప్పుమీద దాని చెయ్యి పడితేదాలు; మిలమిల మెరిసిపొయ్యేది.

అది వచ్చి సరసన కూర్చోగానే, పని దానికి అప్పజెప్పి నేను కూటికి పొయ్యేవాణ్ణి. నాకు నలుగురు పిల్లలు. అందులో ఒకటి చంటిది. చంటిదానిని, వాళ్ళ అమ్మ ఒళ్ళోనేవుంచి మిగిలిన ముగ్గుర్నీ తీసుకొని గుడిసెకు వెళ్ళేవాణ్ణి. వాళ్ళకు అన్నం ముద్దలుచేసి పెట్టి,నేను యింత తిని, మళ్ళీ పనిలోకి వచ్చి, దాన్ని కూటికి పంపేవాణ్ణి, అది తిని వచ్చి నా సరసనే కూర్చొని, సాయంకాలందాకా నా సరసనే కూర్చొని, నాతోపాటు పనిచేసేది. పిల్లలు ఆ చుట్టు పక్కల ఆడుకుంటూ వుండేవారు.

నాకు ఎవ్వరన్నా భయం వుండేదికాదు; పోలీసులంటే మాత్రం భయం. ఉత్తపుణ్యానికి వచ్చేవాళ్ళు; నానా కూతలూ కూసేవాళ్ళు. చివరికి అణో బేడో పుచ్చుకువెళ్ళేవాళ్ళు. ఒకరోజు పోలీసాయన వచ్చాడు.

"లే ఇక్కడనుంచి" అన్నాడు.

నేనూ నా గుడిసెదీ కాళ్ళా వేళ్ళాబడి బతిమాలాం. కాని ఆయన వినలేదు. "ఇక్కడ కూచోటానికి వీల్లేదు, పో" అని అక్కడున్న తోళ్ళ ముక్కల్ని కాళ్ళతో యిటూ అటూ తన్ని పారేశాడు. ఆ తోళ్ళ ముక్కల్ని తంతుంటే నా పిల్లల్ని తంతున్నట్టే అనిపించింది నాకు. "పో ఇక్కడనుంచి. నీ అబ్బగాడి స్థలం అనుకున్నావా!" అని నన్ను బూటు కాలెత్తి తన్నబోయాడు. తన్నాడే అనుకున్నా. తంతే తన్నాడు;

పొమ్మంటాడు అక్కడనుంచి! ఎంత తేలిగ్గా అన్నాడు! కాని ఎక్కడకు పోను? ఎక్కడికి పోయినా ఏ స్థలమూ నాది కాదాయె! డబ్బున్నవాళ్ళమల్లే ఏదన్నా కొట్టు అద్దెకు తీసుకోమంటాడా! పక్క సందుల్లోకి ఎక్కడికన్నా పొమ్మంటాడు. అక్కడికి పోతే చెప్పులు కుట్టించుకునే బాబులు ఎవ్వరు దొరుకుతారు?

వాళ్ళమ్మ కాళ్ళు చుట్టేసుకుని పిల్లలు గొల్లున ఏడ్చారు. నేనిక తట్టుకోలేక తలగుడ్డలోనుంచి ఒక పావులా డబ్బులు తీసి, "ఇంతకంటే యిచ్చుకోలేను బాబూ" అని ఆయన చేతిలో పెట్టపోయా. అందరూ చూస్తున్నప్పుడు యివ్వటం తప్పనుకోలేదు.

ఆ డబ్బునుచూచి యిటూ అటూ చూచి ఆయన ఉగ్రుడైపోయాడు. "లమ్డీకొడకా, నాకు లంచం యిస్తావ్రటా?" అని బూటుకాలుతో డొక్కలో ఒక తన్ను తన్నాడు. అనుకున్నంత పనీ అయింది. నేను మారంగా వెళ్ళి వద్దామ, పావలా ఇవ్వబోవటం తప్పయిందట. డబ్బు ఇవ్వటం నాకు మాత్రం యివ్వాలని వుంటుందా? నేను మాత్రం ఇవ్వగలిగి యివ్వబోయానా? బెదిరించటం, అణో బేడో తీసుకోవటం వాళ్ళకు రివాజేనాయె. అందుకని తప్పదని ఇవ్వబోయా. అదే తప్పయిపోయింది. డొక్క జివ్వున లాగుతూవుంది.

గుడిసెదీ పిల్లలూ ఒక్కటే ఏడుపు. గల్లంతుకి దారేపోయే వాళ్ళం దరూ జేరారు. అందరూ నన్ను తిట్టేవాళ్ళే. "నాలుగు పైసలు జేరేటప్పటికి వళ్ళు బలిసింది. వీడి బతుక్కి వీడు పోలీసాయనకు లంచం యిస్తాడు?........ఏం రా! కళ్ళు నెత్తికొచ్చినయ్యటరా?"

"లేదు బాబూ."

"లేకపోతే నీ బతుక్కితోడు పోలీసాయనికి లంచం యిచ్చేదాకా వచ్చావా? ఆయన ఎవరనుకున్నావు? ఎంత కరెక్టు మనిషి! వీణ్ణి జైల్లోకి తోయించండి పోలీసుగారు, అప్పుడు గాని వీడికి బుద్ధిరాదు"

"బుద్ధి గడ్డితిన్నది బాబూ. నా తప్పు ఈ సారికి కాయండి" అని బతిమాలుకున్నా....ఆయన వినలేదు. వినే వీలులేకపోయిందని, నాకు తరువాత తట్టింది. ఎవర్నని ఏం లాభం?

తోలుముక్కలు యేరుకొని, డేరాగుడ్డ చంకన పెట్టుకొని చెప్పులు మూట కట్టుకొని, నేనూ గుడిసెదీ, పిల్లలూ గుడిసెదారి పట్టాం. నాలుగు రోజులు యెవ్వరికీ మెతుకు లోపలకు పోలేదు. ఏం చేస్తాను? ఒకటి రెండు సార్లు నేను కూర్చునే స్థలం వైపుకు వెళ్ళి చూశాను. అది ఖాళీగానేవుంది. బాపురుమంటూ వుంది. చెప్పులు కుట్టుకోవటానికి నేను కొట్టిన మేకులు ఇంకా అక్కడేఉన్నాయ్. నన్నంతా మరచిపోయినట్లే ఉన్నారు. మరచిపోక నేను అబిలో వాణ్ణా. లెక్కలో వాణ్ణా?

మరుసటిరోజు ఆ బజారు విడిచిపెట్టి మరొక బజార్లో కూచున్నాను. రెండు మూడు రోజులు కొంచెం కొత్త అనిపించింది. గాని అక్కడా బాగానేవుంది. గుడిసెదీ పిల్లలూ అక్కడకు వచ్చి కూర్చునేవారు. మళ్ళీ రోజులు మామూలుగా గడిచిపోతున్నాయి. పోలీసు చేసిన పని అందరం మరచిపోయాం. కష్టపడి సంపాదించి, ఒక చెప్పులుకొట్టు పెట్టాలని నేనూ గుడిసెదీ ఒక రోజు అనుకున్నాం. బజార్లో ఒక చెప్పులకొట్టు చూచినప్పుడల్లా అటువంటి కొట్టు పెట్టాలని నేను యెప్పుడూ అనుకుంటూ వుండేవాణ్ణి. ఆరోజు అందరం సంతోషంగా నిద్దరపోయాం. కొట్టుపెట్టుకుంటే నాది – అనేది ఒక్కటి ఏర్పడుతుంది. ఏ పోలీసు భయమూ ఉండదు. కొట్లో కూచొని గుడిసెదాన్ని సరసన కూచోబెట్టుకొని .... ఆలోచిస్తూ అలానే నిద్దరపోయాను.

ఆరోజు మొదలుకొని అందరం కష్టపడి పనిచెయ్యటం మొదలు పెట్టాం. పెద్దపిల్ల కొంచెం అక్కరకు వచ్చింది. పని యెక్కువయి గుడిసెది నాతోనే కూర్చున్నా, అది కూడు ఉడకేసి పెట్టేది పదిరూపాయలు వెనక వేశాం....యిరవయి రూపాయలు వెనక వేస్తే కొట్టు అద్దెకు తీసుకో వచ్చు —అనుకున్నాం. ఒక కొట్టు మేమున్న స్థలానికి దగ్గరలోనే ఉంది. అది అద్దెకు తీసుకొని, జేరి నెమ్మది నెమ్మదిగా బేరంసాగిద్దాం అనుకున్నాం ఒకరోజు. కాని అన్నీ మనం అనుకున్నట్లు సాగుతయ్యా? అందులో నాబోటివాడికి, సాగవు. ఒకరోజు గుడిసెది వచ్చి పక్కన కూర్చుంది. పాలిష్ చెయ్యవలసిన చెప్పులు వుంటే అవి తీసుకొని పాలిష్ చెయ్యటం మొదలుపెట్టింది. నా కన్ను పడింది! ఏదో కొత్తగా కనిపించింది. అది యెలా పాలిష్ చేస్తుందో నాకు తెలుసు. ఇవ్వాళ ఎవరో కొత్త మనిషి వచ్చి పాలిష్ చేస్తున్నట్టు అనిపించింది. నెమ్మదిగా చూశాను. దాని చేతుల్లో ఇదివరకు సత్తువలేదు. చేతులు వణుకుతున్నాయి.

"ఏందే?" అన్నాను.

"ఏం లేదు" అంది.

దానికళ్ళు ఎర్రగా వున్నయి. మెడమీద చెయ్యివేసి చూశాను. వళ్ళు కాలతా వుంది.

"జరం వచ్చిందే" అన్నాను.

"అదే పోతది" అన్నది.

కాని జరం పోలేదు రోజు రోజుకీ ఎక్కువయింది. పైగా దగ్గు పట్టిపొడిదగ్గు. ఏవో అవీయివీ నూరిపోశారు. తగ్గలేదు.

"డాక్టేరు దగ్గరకు తీసుకువెళ్తా" అన్నాను.

"వద్దు డాక్టేరు తీసేస్తాడా ఎట్లా?" అంది.

"సూది మందిస్తే తగ్గుద్ది" అన్నాను.

"ఏ సూది మందిస్తే వచ్చింది?" అంది.

దానికి డాక్టేరు దగ్గిరికి రావటం యిష్టంలేదు. దాని ఆలోచన నేను కనిపెట్టాను. డాక్టేరుదగ్గరకు వస్తే కూడబెట్టిన డబ్బు అయిపోతుంది. మరి కొట్లో! నేనుకూడా నాలుగు రోజులు వస్తాయించి చూశాను. జరం తగ్గలేదు. పొద్దున్న దగ్గినట్టుండేది; పొద్దుగూకే తలికి యెక్కడనుంచి వచ్చి వద్దో, గుడిసంతా గోల అయిపోయింది. పిల్లల్ని ఆకట్టటం నాతరం కాలేదు. పనిమీదకు మనసే పోయేదికాదు. ఒకరోజు, కాదు గూడదని పట్టుబట్టి డాక్టేరు దగ్గరకు తీసుకుపోయా.

ఆయన బాగా పరీక్షచేసి "వూపిరి తిత్తులు చెడిపోయినై" అన్నాడు.

"ఏందీ?"

"ఊపిరితిత్తులోయ్, వూపిరితిత్తులు."

"ఎందుకు చెడిపోయినై బాబూ?"

డాక్టేరు చెప్పాడు. తప్పు నాదే అన్నాడు. నేను ఎప్పుడూ దాన్ని.

దుమ్ములో కూచోబెట్టానంట. ఆ దుమ్ము ముక్కుల గుండా లోపలకు వెళ్ళి గుండెలు చెడిపోయి నయ్యాంట. అందులో జనం ఎక్కువగా తిరిగేచోట కూర్చో బెట్టగూడదంట. నేను దాన్ని అక్కడే కూచో బెట్టానంట. చేతులారా చేసుకున్నానంట. ఇదేం అన్యాయం? జనం లేనిచోట కూర్చుంటే పొట్ట నిండేది ఎట్లా? అప్పుడప్పుడూ నా దగ్గరకు వచ్చి చెప్పులు బాగు చేయించుకునే వారు ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకు వచ్చేవాళ్ళు. ఎప్పుడన్నా అయితే సరిపోతుందిగాని ఎప్పుడూ రోడ్డు పక్కన కూర్చునే మాకెట్టా కుదురుతుంది-ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకోవటం? దుమ్ములో పుట్టాం దుమ్ములో పెరిగాం. ఎక్కడని ముక్కుకి గుడ్డ అడ్డం పెట్టుకునేటట్టు?

ఏదైతే, ఎట్లాగయితే, గుడిసెది కాలంచేసింది. దాని జబ్బుకి ఉన్నదంతా ఖర్చుపెట్టాను. నేనూ పిల్లలం మిగిలాం. ఇక కొట్టు పెట్టాలనే ఆశ లేదు నాకిప్పుడు. చచ్చేదాకా బతకటం ఒకటే మిగిలింది. అక్కడే కూర్చుని చెప్పులు కుడుతున్నా. పెద్ద పిల్లవచ్చి కూర్చుని నాకు తోడుపడుతూ వుంటుంది. అది అచ్చగా వాళ్ళ అమ్మలాగే పాలిష్ చేస్తుంది. అప్పు డప్పుడూ రోడ్డుమీద రేగే దుమ్ము జ్ఞాపకం వచ్చి గుండె గుబేలుమంటుంది. కాని ఏం చెయ్యను? దుమ్మునుదాటి ఎక్కడికి పోయేటట్టు? దుమ్ములో పుట్టాం, దుమ్ములో పెరిగాం, దుమ్ములోనే చస్తాం.

)o....o(